
నృత్యం చేస్తున్న మహిళలు


జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఆదర్శ పురపాలికగా అభివృద్ధి చేస్తాం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: భూపాలపల్లి పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్ది, పురపాలక సంఘానికి ఆదాయం పెంచే విధంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని కృష్ణాకాలనీ క్రీడా మైదానంలో శనివారం రాత్రి మున్సిపాలిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రావణాసుర వధ కార్యక్రమాన్ని తిలకించడానికి వేలాది మంది తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. భూపాలపల్లి పట్టణానికి రూ. 400 కోట్లతో త్వరలో రింగ్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోని కార్మిక కాలనీల్లో పార్కులు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు ఉపయోగించనున్నట్లు స్పష్టం చేశారు. మూడు రోజుల క్రితం గణపురం మండలం గాంధీనగర్ ప్రాంతంలోని మైలారం గుట్టల ప్రాంతంలో రూ.176 కోట్ల నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాల నిర్మాణాలకు పునాది రాయి వేసినట్లు పేర్కొన్నారు. కొడవటంచ నర్సింహాస్వామి దేవాలయం, పాండవుల గుట్ట, కోటగుళ్ల పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు నిధులు వెచ్చించినట్లు తెలిపారు. అమృత్ పథకంలో రూ.20 కోట్ల నిధులతో పట్టణంలోని తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులు చేపడుతున్నామని, వంద పడకల ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాల కల్పనకు కృషి చేసినట్లు తెలిపారు. స్థానిక సీఐ నరేష్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అనంతరం 45 అడుగుల రావణాసురవధకు ఎమ్మెల్యే జీఎస్సార్ నిప్పు అంటించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ ఛైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, పురపాలక సంఘం కమిషనర్ రాజేశ్వర్, నాయకులు, కౌన్సెలర్లు పాల్గొన్నారు. పట్టణంలోని లక్ష్మీనగర్‌కాలనీ ప్రాంతంలోని భూలక్ష్మి (బొడ్రాయి) ఆలయంలో విజయదశమి పండగ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో మొక్కులు సమర్పించారు. దార పూలమ్మ, మేకల రజిత, బానోతు సమ్మయ్య, సేవానాయక్, బాలునాయక్, దేవేందర్, ఇస్లావత్ రవి, రాజునాయక్, సీతానాయక్, రాములు, మల్లయ్య, మల్లేష్ పాల్గొన్నారు.


దహనమవుతున్న రావణాసురుడి ప్రతిమ

కేటీపీపీ ఇంజినీర్లకు పదోన్నతి

చెల్పూర్, న్యూస్‌టుడే: కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ)లో ఏఈఈలుగా విధులు నిర్వహిస్తున్న 92 మందిని ఏడీఈలుగా, ఏడీఈలుగా విధులు నిర్వహిస్తున్న ఆరుగురికి డీఈలుగా పదోన్నతి కల్పిస్తూ టీజీ జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కోలో విధులు నిర్వహిస్తున్న 203 ఏఈఈలను ఏడీఈలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 34 మంది ఏడీఈలను డీఈలుగా నియమించారు.

కేటీపీపీ సీఈగా శ్రీప్రకాశ్

కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ (కేటీపీపీ) సీఈగా శ్రీ ప్రకాశ్‌ను నియమిస్తూ టీజీ జెన్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కేటీపీపీ రెండో యూనిట్‌లో ఎస్ఈగా విధులు నిర్వహించిన శ్రీప్రకాశ్ ఇటీవల పదోన్నతిపై సీఈగా హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయం సీఈ డిజిటలైజేషన్‌గా బదిలీ అయ్యారు. గతంలో పనిచేసిన సీఈ సిద్దయ్య పదవీ కాలం సెప్టెంబర్‌లో ముగియడంతో 500 మెగావాట్ల మొదటి యూనిట్‌లో సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న కోటేశ్వర్‌రావు తాత్కాలిక సీఈగా బాధ్యతలు చేపట్టారు. తాజాగా కేటీపీపీ నూతన సీఈగా శ్రీప్రకాశ్‌ను నియమిస్తూ సీఎండీ ఉత్తర్వులు జారీ చేశారు.


పరిధి దాటుతున్న ఛైర్మన్ పదవి

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం దేవస్థానం ఛైర్మన్ పదవి కోసం ఆశావహులు మంత్రి శ్రీధర్‌బాబు వద్ద పైరవీలు చేస్తున్నారు. ఈసారి మహదేవపూర్ మండలం నుంచి ఛైర్మన్ పదవి ఎంపిక ఉంటుందని మంత్రి భావించడంతో నియోజకవర్గంలోని ఇతర మండలాలకు చెందిన నాయకులు దరఖాస్తు చేసుకోలేదు. మహదేవపూర్ నుంచి ఇద్దరు, కాళేశ్వరం నుంచి ఒకరు ప్రయత్నాలు చేస్తున్నారు. తాజాగా మహదేవపూర్ మండలానికి కాకుండా జిల్లా లేదా రాష్ట్ర స్థాయి నాయకుడి నియామకానికి మొగ్గు చూపిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాళేశ్వర క్షేత్రానికి త్వరలో మొదటి విడతగా రూ. 40 కోట్లు నిధులు మంజురుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. గోదావరి పుష్కరాలు 2027 వరకు మరిన్ని నిధులు సమకూర్చి మాస్టర్ ప్లాన్‌గా తీర్చిదిద్దాలని మంత్రి సంకల్పం.

ఇసుక దందా.. వారికి మామూలే!

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది.. నియంత్రించాల్సిన పోలీసులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారు. అక్రమార్కులు ఆకేరు, పాలేరు, మోరంచ, యశ్వంతాపూర్, పోచన్నపేట, చలివాగుల పరివాహక ప్రాంతాల్లోంచి, ఏజెన్సీల్లోని వంకల నుంచి వందలాది ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణా చేస్తూ లక్షల రూపాయలు గడిస్తున్నారు. రాష్ట్రంలోని మల్టీజోన్-2లో ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో విఫలమయ్యారంటూ కొంతమంది పోలీసులపై ఉన్నతాధికారులు వేటువేసినట్లు ఇక్కడి పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఈనాడు, మహబూబాబాద్-ఈనాడు, జయశంకర్ భూపాలపల్లి, న్యూస్‌టుడే, వరంగల్ క్రైం





ఉమ్మడి జిల్లాలో ప్రతి రోజు 800 ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.. ముఖ్యంగా ఆకేరు వాగులో అత్యధికంగా తవ్వకాలు జరుపుతున్నారు. వర్ధన్నపేట, ఐనవోలు మండలాల్లో ప్రవహించే వాగు, పరివాహక ప్రాంతంలో జేసీబీ యంత్రాలతోనే తవ్వకాలు చేస్తున్నారు. తొర్రూరు సబ్ డివిజన్ పరిధిలోని నర్సింహులపేట, నెల్లికుదురు, చిన్నగూడూరు మండలాల్లో పారుతున్న వాగు వరదల్లోంచే ఇసుకను కూలీల ద్వారా తోడుతూ రవాణా చేస్తున్నారు. ఆకేరు వాగులోంచి దాదాపు 600ల ఇసుక ట్రాక్టర్లు పట్టణాలకు తరలుతున్నాయి. మిగిలిన 200 ట్రాక్టర్లు జనగామ, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని వాగుల్లోని ఇసుక రవాణా చేస్తున్నాయి.

> వర్ధన్నపేట, మామునూరు ఏసీపీ పరిధిలోని ఐదు స్టేషన్ల అధికారులు దాదాపు 500 ట్రాక్టర్ల యజమానుల నుంచి మామూళ్లు పుచ్చుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నెలనెలా సమర్పించాల్సిందే..

● వరంగల్ కమిషనరేట్ పరిధిలోని వర్ధన్నపేట ఏసీపీ పరిధిలో రెండు పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలకు ఇసుక తవ్వకాలు, అక్రమ రవాణా కల్పతరువుగా మారింది. ఒక స్టేషన్ పరిధిలో మూడేళ్ల కిందట దాదాపు 250 వరకు ట్రాక్టర్లు నడిచేవి.. ఒక్కో ట్రాక్టరు నుంచి నెలకు రూ.500 చొప్పున రూ.1.25 లక్షలు తీసుకునేవారు. ఇప్పుడు ఈ స్టేషన్ పరిధిలో ఒక గ్రామం నుంచి రవాణా చేస్తున్నారు. రెండు వారాల కిందట పది ట్రాక్టర్లను పట్టుకున్న ఎస్సై విలేకరులకు రెండు పట్టుకున్నట్లు వివరాలు వెల్లడించారు. తాజాగా కొద్ది రోజుల కిందట ఐదు వాహనాలను పట్టుకున్నారు. కానీ, ఆ వివరాలు వెల్లడించేందుకు వెనుకాడుతున్నారు. దీని వెనుక 'మతలబు' ఏమిటో మరి..?

● వర్ధన్నపేట ఏసీపీ పరిధిలో జాతీయ రహదారి అనుకుని ఉన్న స్టేషన్‌లో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎస్సైలు, సీఐలు ఇసుకాసురులకు అండగా నిలిచారు. ఇటీవల మరో ప్రాంతానికి వెళ్లిన ఎస్‌హెచ్‌వో వసూళ్లకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. ఆ మండలంలోని రెండు ప్రాంతాల్లో ఏడు జేసీబీ యంత్రాల తవ్వకాలు జరుగుతుండగా నియంత్రించడం లేదు.

● మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు సబ్‌డివిజన్ పరిధిలో ఒక స్టేషన్‌లో ఎనిమిదేళ్ల కిందట పనిచేసిన ఒక ఎస్సై 20 ట్రాక్టర్ల నుంచి అమ్యామ్యాలు తీసుకుంటూ రేయింబవళ్లు ఇసుక రవాణా జరిగేలా వత్తాసు పలికారు. ఆయన బదిలీపై వెళ్లాక ట్రాక్టర్ల సంఖ్య 50కి చేరింది. ఆ స్టేషన్‌కు ఎస్సైగా ఎవరు వచ్చినా అదే పంథా కొనసాగిస్తున్నారు.


మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు వద్ద ఆకేరు ప్రాంతంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు (పాతచిత్రం)

● టేకుమట్ల మండలం కలికోట, చిట్యాల మండల కాల్వపల్లి, మల్హర్ మండలం మల్లారం, కాటారం మండలం విలాసాగర్ ప్రాంతాల నుంచి దందా సాగుతోంది. చిట్యాల మండలం నవాబు శివారు చలివాగు, మొగుళ్లపల్లి మండలం పెద్దవాగు నుంచి తవ్వుతున్నారు.

☛ భూపాలపల్లి మండలంలోని బొగ్గుల వాగు, చెలిమెల వాగులు అటవీ ప్రాంతాల్లో ఉండటంతో సాయంత్రం 6 దాటితే కూలీలతో ట్రాక్టర్లలో ఇసుక నింపి పట్టణానికి తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

● మహదేవపూర్, పలిమెల మండలాల్లోని ఇసుక రీచుల నుంచి అదనపు లోడ్లతో లారీలు వెళ్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదనపు బకెట్‌కు నిర్వాహకులు రూ.2 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. అదనపు లోడింగ్‌తో రహదారులు ధ్వంసమవుతున్నట్లు ఇటీవల మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో స్థానికులు నిరసన తెలిపారు. ఇసుక రీచులు, లారీలను పోలీసులు తనిఖీలు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

మామూళ్లు తీసుకుంటే ఉపేక్షించేది లేదు..

-అంబర్ కిషోర్ ఝా, సీపీ

పోలీసు అధికారులు నెలవారీ మామూళ్లు తీసుకోవద్దని ప్రతి ఠాణా అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాతో సంబంధం ఉన్న అధికారులు డబ్బులు తీసుకుంటే ఉపేక్షించేది లేదు. ఇప్పటికే కొంతమందిని బదిలీ చేశాం.. రానున్న రోజుల్లో మరిన్ని చర్యలు తీసుకుంటాం.

రహదారులు గుంతలమయం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: గత నెలలో కురిసిన అధిక వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. రాంపూర్ నుంచి నాగారం మీదుగా ఆజంనగర్ వరకు 23 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలు పడింది. ఈ రోడ్డుపై భూపాలపల్లి మండలంతో పాటు మహాముత్తారం మండలంలోని పది అటవీ గ్రామాలకు పైగా ప్రయాణికులు ఆధారపడతారు. ఈ రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు.


కాశీంపల్లి నుంచి గొర్లవీడు మధ్యలో రోడ్డు దుస్థితి..

☛ భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ శివారు నుంచి ఆముదాలపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. కమలాపూర్ సమీపంలోని మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చిన్నపాటి వర్షం పడినా గుంతలలో నీరు నిలిచి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నారు. రాత్రి వేళ ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారి మధ్యలోని లోలెవల్ కల్వర్టు పైపులు ధ్వంసమై ప్రమాదంగా తయారైంది.

☛ మండలంలోని కాశీంపల్లి శివారు నుంచి గొర్లవీడు వరకు రోడ్డు ధ్వంసమై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాచారం వరకు గల రోడ్డు పలు ప్రాంతాల్లో కోతకు గురైంది. మరమ్మతు పనులు చేపట్టాలని పలు అటవీ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

☛ అనుసాన్‌పల్లి సమీపంలోని వడ్లోనివాగు ప్రాంతంలో వరద తాకిడికి తారు రోడ్డు కోతకు గురైంది. దీంతో కొద్ది రోజులుగా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సమస్యను అధికారులకు వివరించిన మరమ్మతు పనులు చేపట్టడం లేదు. అనుసాన్‌పల్లి మాజీ సర్పంచి జగన్ సొంతగా ట్రాక్టర్‌తో మొరం పోయించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.


ప్రతిపాదనలు పంపించాం

- నాగరాజు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, భూపాలపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లు గత నెలలో కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్నాయి. మరమ్మతు పనుల నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభిస్తాం.

ధన్వాడలో మంత్రి ప్రత్యేక పూజలు

కాటారం, న్యూస్‌టుడే: ధన్వాడ గ్రామంలోని దత్తాత్రేయ ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్‌పూర్ గ్రామానికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బూడిదపల్లి వరకు మంజూరైన రహదారి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు పంతకాని సమ్మయ్య, మహేశ్వరి, దేవేందర్‌రెడ్డి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఆధిపత్య పోరులో.. నువ్వా.. నేనా?

మంత్రి సురేఖ X **ఎమ్మెల్యే రేవూరి**





రంగంపేట, పరకాల, న్యూస్‌టుడే

వరంగల్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు ఎక్కువైంది. రాష్ట్ర రాజకీయాల్లో ఇక్కడి కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల తీరు చర్చనీయాంశంగా మారింది. అధిష్ఠానం పెద్దల హెచ్చరికలనూ లెక్కచేయడం లేదు. పది రోజుల క్రితమే ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్యులతో హైదరాబాద్‌లో అంతర్గత సమావేశం నిర్వహించి సయోధ్యకు ప్రయత్నించారు. అయినా తీరు మారడం లేదు. మేము ఎవరి మాటా.. వినేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆదివారం గీసుకొండ మండలం ధర్మారం గ్రామంలో ఏర్పడిన ఫ్లెక్సీ గొడవ చినికి చినికి గాలివానలా మారింది. అధికార నాయకులు, కార్యకర్తలు నర్సంపేట-వరంగల్ ప్రధాన రహదారిపై బైఠాయించడం.. గంటల పాటు ప్రజా రవాణకు అంతరాయం ఏర్పడటంతో తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తాయి. పరకాలపై పట్టు కోసం రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నువ్వా.. నేనా? అన్నట్లు ముందుకెళ్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఇవేమి గొడవలంటూ సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. ఇద్దరి నుంచి వివరణ కోరినట్లుగా సమాచారం.

పది నెలలుగా ..

గత శాసనసభ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చివరి సమయంలో భాజపా నుంచి కాంగ్రెస్‌లో చేరి పరకాల నుంచి పోటీ చేశారు. ఎన్నికల సమయంలో కొండా, రేవూరి మధ్య సఖ్యత ఉంది. ఎమ్మెల్యేగా రేవూరి గెలిచిన నాటి లొల్లి మొదలైంది. గత పది నెలలుగా వరుస వివాదాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యేగా నేనుండగా మంత్రి సురేఖ పెత్తనం ఏంటని రేవూరి ప్రశ్నిస్తున్నారు. వరంగల్ జిల్లా నుంచి మంత్రి హోదాలో అన్ని నియోజకవర్గాల్లో సమయస్వయం చేయాల్సిన మంత్రి ఇలా చేయడం సరైందేనా? అని నిలదీస్తున్నారు. పరకాలలో మొదటి నుంచి కొండాను నమ్ముకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే రేవూరి ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు గురిచేయడం, పోలీసుల చేత కొట్టించడం ఎంతవరకు సమంజమని మంత్రి సురేఖ బాహాటంగానే విమర్శలు చేశారు. గీసుకొండ, పరకాల మండలాల్లో కొండా, రేవూరి వర్గాల నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా చీలారు. అధిష్ఠానం పెద్దలు హెచ్చరించినా తీరు మారడం లేదు.

తారస్థాయికి విభేదాలు

● గీసుకొండ మండలంలో వీరగోని రాజ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్పించడంపై మంత్రి సురేఖ ఎమ్మెల్యే రేవూరికి ఫోన్ చేసి మాట్లాడటం, ఆడియో టేపులు బయట పడటం చర్చనీయాంశంగా మారింది. తదనంతరం తనకు తెలియకుండా పలు మండలాలకు చెందిన వారిని పార్టీలోకి తీసుకోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తితో ఉన్నారు. ఇదే విషయమై ఏప్రిల్ నెలలో గీసుకొండ మండలంలో 'కొండా' వర్గానికి చెందిన ఒకరిపై పరకాలలో కేసు కూడా నమోదైంది.

● మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్యపై మంత్రి బాహాటంగానే విమర్శలు గుప్పించారు.

● కొన్ని నెలలుగా గీసుకొండ మండలంలో ఆధిపత్యం కోసం స్థానిక కాంగ్రెస్ నాయకులు చిన్నాచితకా అంశాలు పెద్దవి చేసి గొడవలు సృష్టిస్తున్నారని తెలిసింది. దీంతో కొండా, రేవూరి వర్గాల మధ్య దూరం పెరిగింది.

● గత ఏప్రిల్ 7న రాజ్‌కుమార్, మరికొందరి చేరిక కోసం కొనాయమాకులలో పార్టీ సమావేశానికి అనుమతివ్వాలని వైస్ ఎంపీపీ శ్రావ్య భర్త రడం భరత్ అప్పటి వరంగల్ సహాయ ఎన్నికల అధికారికి దరఖాస్తు చేశారు. అనుమతిని రద్దుపర్చాలని అధికార పార్టీకి చెందిన చాడ కొమురారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పరకాల పోలీసుస్టేషన్‌లో రడం భరత్‌పై కేసు నమోదు చేశారు.

● పార్లమెంట్ ఎన్నికల ఇన్‌ఛార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డిపల్లి శివారులోని ఓ వేదిక మందిరంలో వరంగల్ పార్లమెంట్ విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. మంత్రి సురేఖ రాకుండానే సమావేశం ఎలా నిర్వహిస్తారని ఘర్షణకు దిగారు. దీంతో కొండా వర్గీయులకు, కాంగ్రెస్ స్థానిక కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. వేదికపైనే గజ్జి విష్ణును, అతడి అనుచరులను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ ప్రకటించారు.

బాల్యానికి...
మూడు 'ముళ్ల' బంధం!
వివరాలు 6లో


తాళి బొట్టు చూపుతున్న అర్చకుడు


పాల్గొన్న భక్తులు

కల్యాణం.. కమనీయం

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం ఆదివారం రాత్రి కమనీయంగా సాగింది. ప్రధానార్చకుడు శేషు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు, వేద పాఠశాల విద్యార్థులు భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం జరిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, రంగంపేట




ముక్తీశ్వరుడి సన్నిధిలో పోలీసు ఉన్నతాధికారి


సన్మానిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వర క్షేత్రంలో రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తన కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వరం వచ్చారు. అర్చకులు స్వాగతం పలికి పూజలు నిర్వహించారు. శుభానంద ఆలయంలో అర్చకులు సన్మానించి వేద ఆశీర్వచనం చేశారు. కాళేశ్వరం, కోటపల్లి ఎస్సైలు చక్రపాణి, రాజేందర్‌లు పాల్గొన్నారు.

బాల్యానికి.. మూడుముళ్ల బంధం!

న్యూస్‌టుడే, భూపాలపల్లి రూరల్



● అడ్డుకున్న బాల్య వివాహాల సంఖ్య
● నమోదు చేసిన కేసులు

తోటి స్నేహితులతో కలిసి ఆటపాటలతో చదువు కొనసాగించాల్సిన బాల్యం.. వివాహమనే మూడు ముళ్ల బంధంలో చిక్కుకుంటోంది. తెలిసీ తెలియని వయసులో కుటుంబ బాధ్యతలను మోస్తూ బాలల జీవితాన్ని కొనసాగిస్తున్నారు. సరైన అవగాహన లేక గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిత్యం కౌన్సెలింగ్ చేపడుతున్నా.. ఎక్కడో ఒకచోట చోటుచేసుకుంటూనే ఉన్నాయి. మళ్లీ పెళ్లిళ్ల సీజన్ మొదలైంది.. ఈ నేపథ్యంలో బాల్య వివాహాలకు అడ్డుకట్టలపై 'న్యూస్‌టుడే' కథనమిది.

జిల్లా, మండల, గ్రామ కమిటీలు

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు చట్టప్రకారం జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్, గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్, గ్రామ పెద్దలు ప్రతినిధులుగా బాధ్యులుగా ఉంటారు. బాల్య వివాహ సమాచారం చరవాణి ద్వారా, లిఖితపూర్వకంగా, మెసేజ్ ద్వారా వచ్చినా తక్షణమే స్పందించాల్సి ఉంటుంది. అలాగే ప్రతి వివాహాన్ని తప్పనిసరిగా వివాహ నమోదు చట్టం ప్రకారం పంచాయతీలో నమోదు చేయాలి. ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 ప్రకారం 18 ఏళ్ల లోపు ఆడపిల్లలు, 21 ఏళ్ల లోపు మగ పిల్లలు బాలల కిందికి వస్తారు.

సమాచారం ఇవ్వాల్సింది వీరికే..

గ్రామ, ఇతర ప్రాంతాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు ఎవరి దృష్టికైనా వస్తే వెంటనే 100, 181, 1098 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ ద్వారా సమాచారం అందించవచ్చు. లేదా సమీపంలోని అంగన్‌వాడీ టీచర్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పోలీస్, సీడీపీవో, తహసీల్దార్, చైల్డ్‌లైన్ సిబ్బంది, ఆర్డీవో, కలెక్టర్ ఇలా ఎవరికైనా ఫిర్యాదు చేయవచ్చు.



భూపాలపల్లి జిల్లాలోని ఒక గ్రామంలో బాల్య వివాహాలపై కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న బాలల పరిరక్షణ విభాగం అధికారులు

మచ్చుకు కొన్ని..

● భూపాలపల్లి జిల్లాలోని ఒక మండలంలో తల్లిదండ్రులు డబ్బులకు ఆశపడి బాలికకు 50 ఏళ్ల పైబడిన వ్యక్తితో పెళ్లి జరిపించారు. చైల్డ్ లైన్ విభాగం అధికారులు గ్రామానికి వెళ్లి బాలికను రక్షించి బాలల సదనంలో వసతి కల్పిస్తున్నారు.

● జనగామ జిల్లాలోని ఒక మండలంలో బాలిక వివాహం తెల్లవారుజామున జరిగింది. విషయం తెలుసుకున్న చైల్డ్‌లైన్ అధికారులు అక్కడికి వెళ్లగా కుటుంబ సభ్యులు అధికారులపై దాడికి ప్రయత్నించారు. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి బాలికను సీడబ్ల్యూసీ ముందు హాజరు పరిచారు. గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు వచ్చి బాలికను చదివిస్తామని రాతపూర్వకంగా ఇవ్వడంతో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ జరిపి బాలికను పంపించారు.

● జనగామ జిల్లాలో వేరే జిల్లా నుంచి వలస వచ్చిన కుటుంబం వారి కూతురుకు వివాహం చేస్తున్నారనే సమాచారంతో బాలల పరిరక్షణ విభాగం అధికారులు అక్కడకు వెళ్లి బాలికను రక్షించి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. ప్రస్తుతం బాలిక చదువుకుంటోంది.

● మహబూబాబాద్ జిల్లాలో బాలికకు వివాహం జరుగుతుందనే సమాచారం రావడంతో రాత్రి సమయమైనా సదరు చైల్డ్‌లైన్ విభాగం అధికారులు అక్కడకు వెళ్లి బాలికను రక్షించారు. తల్లిదండ్రులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు.

అనారోగ్య సమస్యలు తప్పవు

- అన్నమనేని అనిల్ చందర్‌రావు, సీడబ్ల్యూసీ చైర్మన్, హనుమకొండ, భూపాలపల్లి



బాల్య వివాహాలు చేస్తున్నట్లు ఎవరి దృష్టికి వచ్చినా వెంటనే సమాచారం అందించాలి. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 100, 181, 1098 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం అందిస్తే వెంటనే స్పందించి బాల్య వివాహాన్ని అడ్డుకుంటాం. బాలికలు శారీరక, మానసికంగా ఎదగక ముందే పెళ్లి చేయడం వల్ల పుట్టే బిడ్డ అనారోగ్యంతో పుట్టడం, అబార్షన్లు కావడం, తదితర అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఎన్నో కారణాలు

పేదరికం, నిరక్షరాస్యత వంటివి బాల్య వివాహాలకు కారణమవుతున్నాయి.. మరోవైపు కుటుంబాల మధ్య సంబంధ బాంధవ్యాలను పటిష్ఠ పర్చుకోవడానికి ఆడపిల్ల పుట్టగానే బంధువర్గంలో పిల్లవాడికి ఇస్తామని నిర్ణయించుకుంటారు. పిల్లలు కొంచెం పెద్దవారు అవగానే వివాహం చేయడం, అలాగే కుటుంబంలో వృద్ధులు చనిపోయేలోపు తమ వారసుల పెళ్లిళ్లు చూడాలనే కోర్కెలు తీర్చేందుకు బాల్య వివాహాలను చేస్తున్నారు. అబ్బాయిలతో పోలిస్తే అమ్మాయిలకే ఎక్కువగా ఇలా జరుగుతున్నాయి. పెళ్లి చేస్తే తమ పని అయిపోతుందని తల్లిదండ్రులు భావించడం కూడా మరో కారణం..

అందరూ శిక్షార్హులవుతారు..

- చిన్నయ్య, జిల్లా సంక్షేమాధికారి



బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం.. తల్లిదండ్రులతో పాటు బాల్య వివాహాల్లో పాల్గొనే పురోహితులు, టెంటు హౌజ్ వారు, బాజాభజంత్రీల వారు, పెళ్లికి హాజరైన బంధువులు అందరూ శిక్షార్హులే. రెండేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు తమ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం మంచిగా చదువుకునేలా ప్రోత్సహించాలి.

కనుల పండువగా తెప్పోత్సవం



అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం



భద్రకాళి చెరువులో హంసవాహన సేవ

రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయదశమి(దసరా) పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి భద్రీ తటాకం(భద్రకాళి చెరువు)లో నిర్వహించిన తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. ప్రత్యేకంగా తయారు చేసిన తెప్పను హంస వాహనంగా సుందరంగా తీర్చిదిద్ది, రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో శ్రీభద్రకాళి భద్రేశ్వరుల ఊరేగింపు వైభవంగా సాగింది. ఒకవైపు వేద మంత్రాలు, మరోవైపు భద్రకాళి చెరువు అలలు, చల్లని గాలుల్లో.. భద్రకాళి శరణం మమ..! అని భక్తులు నినదిస్తూ.. పులకించిపోయారు. మంత్రి కొండా సురేఖ, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డా.బండా ప్రకాశ్, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, వరంగల్ కలెక్టర్ డా.సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ రామల సునీత తదితరులు హాజరై అమ్మవారికి పూజలు చేశారు. అంతకుముందు శనివారం ఉదయం శ్రీభద్రకాళి అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం, చక్రతీర్థోత్సవం(చక్రస్నానం), ధ్వజారోహణం నిర్వహించారు. పండగ వేళ రెండురోజుల పాటు ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ చిత్రంలో మేయర్ సుధారాణి తదితరులు

క్రీడాకారుల ఎంపిక పూర్తి.. ప్రవేశాలకు కుస్తీ

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పట్టు సాధిస్తే.. ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో ప్రావీణ్యం సాధించడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ క్రీడా పాఠశాలలు, వసతిగృహాలు అందుబాటులో ఉన్నాయి. అందులో భాగంగా హనుమకొండలోని ప్రాంతీయ క్రీడా వసతిగృహంలో ప్రవేశాలకు రెజ్లింగ్(కుస్తీ) క్రీడాకారులకు అవకాశం కల్పించారు. ఎంపికలు పూర్తి చేసిన అధికార యంత్రాంగం ఇప్పటి వరకు ప్రక్రియ పూర్తి చేయలేదు. దీంతో ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులు అసహనానికి గురవుతున్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తారు. జాతీయస్థాయి మాజీ క్రీడాకారులు, ఎన్ఎస్ఐ(నేషనల్ స్పోర్ట్స్ ఇన్‌స్టిట్యూట్)లో తర్ఫీదు పొంది.. ప్రావీణ్యం కలిగిన కోచ్‌లు ఉన్నారు. సుమారు 150 మంది క్రీడాకారులు శిక్షణ పొందేందుకు ప్రభుత్వ అనుమతి ఉంది. కానీ ప్రతిభావంతులైన ఆటగాళ్ల గుర్తింపు, సత్ప్రవర్తన, క్రమశిక్షణ పాటించని వారిని పరిగణనలోకి తీసుకోకపోవడం తదితర కారణాలతో క్రీడాకారుల సంఖ్య 50 శాతానికి చేరింది. దీంతో అదనంగా ఈత(స్విమ్మింగ్), రెజ్లింగ్ క్రీడల కోసం ప్రవేశాలు కల్పించారు. జులై 3, 4వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఎంపికలు చేశారు. ఈత పోటీలకు సరైన సంఖ్యలో క్రీడాకారులు హాజరుకాకపోవడంతో దానిని ప్రాంతీయ క్రీడా వసతిగృహం నుంచి తొలగించారు.



జేఎన్ ఇండోర్ స్టేడియంలో సాధన చేస్తున్న రెజ్లర్లు

20 మందిని గుర్తించినా..!

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఎంపిక ప్రక్రియకు రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ పర్యవేక్షణలో నిర్దేశించిన శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు వరంగల్, నల్గొండ, ఖమ్మం, నిజామాబాద్ నుంచి 70 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అత్యుత్తమ నైపుణ్య ప్రదర్శన కనబర్చిన 20 మంది క్రీడాకారులను హైదరాబాద్ నుంచి వచ్చిన రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ కమిటీ ఎంపిక చేసింది. అయినా.. ఎంపికైన క్రీడాకారులకు ఇప్పటి వరకు ప్రవేశాలు కల్పించలేదు. దీంతో ఎంపికైనవారు ఎక్కడ చదువుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్ తదితర క్రీడాంశాల్లో ప్రవేశం పొందినవారు హనుమకొండ జేఎన్ స్టేడియంలోని ప్రాంతీయ క్రీడా వసతిగృహంలో చేరారు. కానీ వారితోపాటు ఎంపికైన రెజ్లింగ్ క్రీడాకారులకు మాత్రం అధికారుల నుంచి ఇప్పటి వరకు పిలుపు రాలేదు. విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ అధికారులపై ఉంది.

చదువుకు ఇబ్బంది అవుతోంది

- ఇటుకాల వరుణ్, చాపలబండ, వరంగల్



మాది వ్యవసాయ కుటుంబం. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాను. రాష్ట్రస్థాయిలో రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచా. ఆర్ఎస్‌హెచ్‌లో కష్టపడి ఎంపికై నెలలు గడుస్తున్నా.. ప్రవేశాలు కల్పించడం లేదు. ఎక్కడ చదవాలో అర్థం కావడం లేదు. ప్రవేశాల జాప్యంతో ఆటతో పాటు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. త్వరలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు ఉన్నాయి. ప్రవేశాలు కల్పిస్తే సాధనతోపాటు పతకాలు సాధించే అవకాశం ఉంది.

మెరుగైన శిక్షణ లభిస్తుంది

- వలసాని గణేశ్, తిప్రారం, నల్గొండ జిల్లా

నిరుపేద కుటుంబానికి చెందిన నాకు ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో అవకాశం దక్కడం అదృష్టం. ప్రవేశాలు ఆలస్యం కావడంతో సాధన చేయలేక పోతున్నాను. ఖేలో ఇండియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న అనుభవం ఉంది. ఎంపిక పోటీల్లో కష్టపడి ప్రతిభ కనబరిచా.

క్రీడాకారులకు నష్టం

- మహ్మద్ కరీం, కార్యదర్శి, తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ సంఘం

హనుమకొండలోని ప్రాంతీయ వసతిగృహంలో రెజ్లింగ్ ప్రవేశాలు తీవ్ర ఆలస్యం కావడంతో క్రీడాకారులు నష్టపోతున్నారు. ఒలింపిక్స్, వరల్డ్ ఛాంపియన్‌షిప్ టోర్నీల్లో భారత రెజ్లర్లు పతకాలు కొల్లగొట్టారు. భవిష్యత్తులో ఓరుగల్లు నుంచి ఆ స్థాయి రెజ్లర్లు వచ్చే అవకాశం ఉంది. హనుమకొండలోని ఆర్ఎస్‌హెచ్‌లో రెజ్లింగ్‌లో ప్రవేశాలు పూర్తి చేయాలి. తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఛైర్మన్ శివసేనారెడ్డి దృష్టికి తీసుకెళ్లాం.

చికెన్ ధరలు (వెన్‌కాబ్)	(కిలో వెల రూపాయలలో)	
	ఫారంరేటు: 126	డ్రెస్డ్: 215
	రిటైల్: 148	స్కిన్‌లెస్: 244


'యిమ్మడి' ఇంట ఉమ్మడి సంబురం..!



దసరా వేడుకలకు హాజరైన కుటుంబసభ్యులు

మహబూబాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త యిమ్మడి వెంకటేశ్వర్లు కుటుంబంలో నాలుగు తరాలవారు దసరా సందర్భంగా కలుసుకొని సందడి చేశారు. వీరు ఆరుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు.. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడి దేశ, విదేశాల్లో ఉంటున్నారు. ప్రతి దసరాకు కుటుంబ సభ్యుల్లో ఒకరి ఇంట కలుసుకుని ఆనందంగా గడుపుతారు. ఈసారి హనుమకొండ టీచర్స్‌కాలనీలోని యిమ్మడి పుల్లయ్య ఇంట్లో పండగ చేసుకున్నారు. 60 మందికిపైగా పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కాజీపేట, మానుకోట

వలలో చిక్కి.. విలవిల్లాడి..!



రమేశ్ (పాతచిత్రం)

నెక్కొండ, న్యూస్‌టుడే: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని రెడ్లవాడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్లవాడ గ్రామానికి చెందిన నీరటి రమేశ్(39) ఆదివారం ఉదయం గ్రామంలోని జాలర్లతో కలిసి ఊరచెరువులో చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి చెరువులో పడిపోయాడు. చేపల వల అతనికి చుట్టుకోవడంతో బయటకు రాలేక విలవిల్లాడిపోయాడు. గమనించిన తోటి జాలర్లు కాపాడే ప్రయత్నం చేసినా.. అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య అమృత, కుమార్తె మానస, కుమారుడు మహేష్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి తిథి కార్యానికి వస్తూ..
కుమారుడి దుర్మరణం



రవీందర్‌రెడ్డి (పాతచిత్రం)

ఓదెల, లింగాలఘనపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం వడ్డిచర్ల చిన్న మోరీ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వడ్డిచర్ల, మృతుడి గ్రామస్థులు, ఎస్సై శ్రవణ్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన నోముల రవీందర్‌రెడ్డి(32) నల్గొండలో ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నాడు. తండ్రి రాంచంద్రారెడ్డికి 2 సంవత్సరాల తిథి నిర్వహించడానికి కారులో స్వగ్రామానికి వస్తుండగా జనగామ, సూర్యాపేట జాతీయ రహదారిలో వడ్డిచర్లలో కారు అదుపుతప్పి డివైడర్‌ను, కల్వర్టు గోడను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రవీందర్‌రెడ్డిని స్థానికులు 108లో జనగామ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. రవీందర్‌రెడ్డి జమ్మికుంటలో చదువుతున్న సమయంలో తప్పిపోయి 12 సంవత్సరాలు తల్లిదండ్రులకు దూరమై గత 4 సంవత్సరాల క్రితమే స్వగ్రామం వచ్చాడు. తండ్రికి తిథి ఇవ్వడానికి వస్తూ యువకుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి వద్ద ఉన్న రూ.57,120, చరవాణిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కొండా వర్గానికి చెందిన 8 మందిపై కేసు

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండ మండలం 16వ డివిజన్ పరిధి ధర్మారంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఫ్లెక్సీలను మంత్రి కొండా సురేఖ వర్గానికి చెందిన అనుచరులు చింపివేయడంతో పాటు పిట్టల అనిల్‌పై దాడి చేసి గాయపర్చిన ఘటనలో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గానికి చెందిన పిట్టల అనిల్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుపాకి సంతోష్ ఫిర్యాదు మేరకు కొండా వర్గానికి చెందిన బండి రాజు, ముస్కు సురేష్, కూస రాజ్‌కుమార్, చుంచు రాజు, చౌడ శివకుమార్, ముస్కు రంజిత్‌కుమార్, మహేశ్వర్, వంశీలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పిట్టల అనిల్ వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. అనంతరం అనిల్ ఇంటికి రాగా ఎమ్మెల్యే రేవూరి ఆయనను పరామర్శించారు.



పోలీస్‌స్టేషన్‌లో వరంగల్ డీసీపీ రవీందర్‌తో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

స్టేషన్ వద్ద ఉద్రిక్తత

గీసుకొండ : తమ అనుచరులను గీసుకొండ పోలీసులు అకారణంగా అరెస్టు చేశారని మంత్రి కొండా సురేఖ ఆదివారం సాయంత్రం అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సురేఖ రాస్తారోకో చేస్తున్న కార్యకర్తల వద్దకు వరంగల్ నుంచి కాన్వాయ్‌తో వచ్చారు. అనంతరం ఆమె ధర్మారం నుంచి ఆటోలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఈ సమాచారం అందుకున్న సురేఖ అనుచరులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ స్టేషన్‌కు వచ్చారు. వరంగల్ నుంచి పోలీసు బలగాలు వచ్చి కొండా వర్గీయులను స్టేషన్ నుంచి బయటికి పంపించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా మంత్రి సురేఖతో చర్చించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సురేఖతోపాటు కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



గీసుకొండ పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్న మంత్రి కొండా సురేఖ అనుచరులు

వైద్యుల స్మారక విగ్రహావిష్కరణ



ఐఎంఏ హాలులో..

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కరోనా సమయంలో ప్రజలకు వైద్య సేవలందిస్తూ.. వ్యాధిబారినపడి మృతిచెందిన 11 మంది వైద్యుల స్మారక విగ్రహాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో ఏర్పాటు చేశారు. విగ్రహాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీప్రసాదరావు ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డా.అన్వర్, డా.బింగి శ్రీనివాస్, కోశాధికారి డా.దిడ్డి శ్రవణ్‌కుమార్, ఐఎంఏ సెంట్రల్ కమిటీ సభ్యులు డా.బందెల మోహన్‌రావు, డా.అశోక్‌రెడ్డి పలువురు సీనియర్ వైద్యులు పాల్గొన్నారు.

జిల్లాకో కేంద్రం.. అందుబాటులో ఔషధం

న్యూస్‌టుడే, ఎంజీఎం ఆసుపత్రి

జిల్లాకో 'సెంట్రల్ డ్రగ్ స్టోర్' ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ ప్రభుత్వ వైద్య, మౌలిక సేవల సదుపాయాల సంస్థ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లాకు సంబంధించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్(కేంద్ర ఔషధ గిడ్డంగి)ని అధికారులు ఉర్సులోని ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం హనుమకొండలో కేయూ ఎదురుగా టీబీ ఆసుపత్రి పక్కన ఉమ్మడి జిల్లాకు సంబంధించిన కేంద్రం ఉంది. ఇప్పటి వరకు ఇక్కడి నుంచే ఉమ్మడి ఆరు జిల్లాలకు ఔషధాలు, శస్త్రచికిత్సకు సంబంధించిన వస్తువులు సరఫరా అయ్యేవి. దీంతో దూరప్రాంత జిల్లాలకు మందుల సరఫరా ఒక్కోసారి కష్టతరమయ్యేది. రవాణా పరమైన ఇబ్బందులూ ఎదురయ్యేవి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కేంద్ర ఔషధ గిడ్డంగులు ఏర్పాటు చేయడం ద్వారా అడ్డంకులు అధిగమించాలని నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో తొలుత మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ప్రారంభించారు. తాజాగా వరంగల్ జిల్లాతో పాటు, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల్లోనూ కేంద్రాలు ప్రారంభించారు. వరంగల్ ఉర్సులోని సీకేఎం ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న ప్రసూతి ఆసుపత్రిలో కేంద్రం ఏర్పాటు చేసి.. ఇటీవల కొన్నిరకాల ఔషధాలు, సర్జికల్ వస్తువులు నిల్వ చేశారు. దీని బాధ్యతలను హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఫార్మసీ సూపర్‌వైజర్ నాగమణి, మరో ఫార్మాసిస్టు సుధాకర్‌రెడ్డిలకు అప్పగించారు. త్వరలో కంప్యూటర్ల ఏర్పాటుతో పాటు సిబ్బందిని నియమించి, స్టోర్‌ను పూర్తిస్థాయిలో కొనసాగించనున్నారు. ఇకపై ఈ కేంద్రం నుంచే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రితోపాటు సీకేఎం ఆసుపత్రి, ప్రాంతీయ నేత్రవైద్యశాల, వరంగల్ జిల్లా పరిధిలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, పల్లె దవాఖానాలు, బస్తీ దవాఖానాలకు మందులు, ఇంజక్షన్లు, సర్జికల్ వస్తువులు సరఫరా అవుతాయని అధికారులు తెలిపారు. జిల్లాల వారీగా కేంద్రాల ఏర్పాటుతో హనుమకొండలోని ఉమ్మడి జిల్లా సెంట్రల్ డ్రగ్ స్టోర్‌పై ఒత్తిడి తగ్గనుంది.



ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సూచిక



వరంగల్ ఉర్సులోని ప్రభుత్వ ఆసుపత్రి

ప్రసూతి సేవలకు కష్టమే

సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటుతో ఉర్సు ప్రసూతి ఆసుపత్రిలో ఇకపై ప్రసూతి సేవలు పునరుద్ధరించడం కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 30 పడకల ఆసుపత్రిలో ఒకప్పుడు ఉర్సు, కరీమాబాద్, రంగశాయిపేట, శివనగర్, ఖిలావరంగల్, జక్కలొద్ది, మామునూరు తదితర శివారు గ్రామాల ప్రజలకు సేవలందేవి. ప్రసవాలు, స్త్రీ వైద్యసేవల కోసం ప్రజలు వరుసకట్టేవారు. ప్రత్యేక రాష్ట్రంలో ఆసుపత్రిని పునరుద్ధరిస్తారని ప్రజలు ఆశించినా అది జరగలేదు. ప్రస్తుతం కేవలం ఓపీ సేవలు మాత్రమే అందిస్తున్నారు. ఇక డ్రగ్ స్టోర్ ఏర్పాటుతో భవిష్యత్తులో ఆసుపత్రి పునరుద్ధరణ అసాధ్యమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చెరువు శిఖంలో క్రీడా మైదానం



మల్హర్ మండలం అన్‌సాన్‌పల్లి శివారులోని పెద్ద చెరువు శిఖం భూమిలో అధికారులు తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇక్కడ గడ్డి పెరిగి విష పురుగులు సంచరిస్తున్నాయి. క్రీడా మైదానం ఏర్పాటుకు ముందే అధికారులు అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేయకుండా మొక్కుబడిగా చెరువు శిఖం భూమిలో ఏర్పాటు చేయడం అది నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా గ్రామస్థులకు అనుకూలంగా అందుబాటులో ఉండే విధంగా క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయాలని యువకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, భూపాలపల్లి

నిఘా నేత్రాలతో నేరాల నియంత్రణ


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్

కాటారం, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణలో నిఘా నేత్రాల పాత్ర కీలకమని సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ అన్నారు. విలాసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ప్రారంభించారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు అందరూ సహకరించాలని, నిఘా నేత్రాలతో ప్రజలకు మరింత రక్షణగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

భూపాలపల్లి రూరల్, న్యూస్‌టుడే: పాత కక్షలతో ఒకరిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని కమలాపూర్‌లో శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దవేణి శ్రీవర్ధన్‌కు అదే గ్రామానికి చెందిన మూడెత్తుల శ్రీకాంత్‌కు గతంలో గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో శనివారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో శ్రీవర్ధన్ శ్రీకాంత్‌పై కత్తితో దాడి చేశాడు. స్థానికులు 108 లో ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ కళాశాలలు బందుచేస్తే చర్యలు

విద్యానగర్, న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలను యాజమాన్యాలు నిరవధికంగా బందు చేస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి ఆదివారం ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బోధనా రుసుం విడుదలలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో యాజమాన్యాలు దసరా సెలవుల అనంతరం ఈ నెల 14 నుంచి కళాశాలలను తెరవబోమని ఇటీవల వినతి పత్రం ఇచ్చారు. దీనిపై రిజిస్ట్రార్ స్పందిస్తూ.. కళాశాలలు బందు చేస్తే డిగ్రీ ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలపై ప్రభావం పడుతుందని అన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చిట్యాల, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన బుర్ర మహేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా స్థానికులు రూ.32 వేలు జమ చేసి ఆదివారం బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో కట్కూరి నరేందర్, గంగాధరి రాజు, ఎండీ రాజ్‌మహ్మద్, నేపాలి రాకేశ్, చిలుముల రాజేశ్, బండి రాజు, గాజర్ల అఖిల్, మాటూరి లవన్‌బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉన్నతస్థానాలు


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న భద్రాచలం ఎమ్మెల్యే వెంకట్రావు

వెంకటాపురం, న్యూస్‌టుడే: క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే సామాన్యులు సైతం ఉన్నతస్థానాలకు ఎదగొచ్చని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ములుగు జిల్లా వెంకటాపురంలోని క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న వెంకటాపురం ప్రైమరీ లీగ్ క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంత యువకులు, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చాలన్నారు. టోర్నీలో విజేతగా నిలిచిన సాయిమెస్ ఎలెవన్ జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి, ట్రోఫీని, ద్వితీయస్థానంలో నిలిచిన వైకింగ్ ఎలెవెన్ జట్టుకు రూ.30 వేల నగదు బహుమతి, ట్రోఫీ, మూడో స్థానంలో నిలిచిన ఏకే వారియర్స్ జట్టుకు రూ.10 వేల నగదుతో పాటు ట్రోఫీ అందజేశారు. పలువురు క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ బండారి కుమార్, ఎస్సై కొప్పుల తిరుపతి రావు, శిక్షణ ఎస్సై ఆంజనేయులు, పీఏసీఎస్ ఛైర్మన్ మోహన్‌రావు, ట్రోఫీ నిర్వహణ కమిటీ సభ్యుడు రవికుమార్, అమ్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కృష్ణబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్‌హుస్సేన్, భాజపా జిల్లా కార్యదర్శి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఆదిమానవుల సమాధుల సందర్శన

తాడ్వాయి, న్యూస్‌టుడే: తాడ్వాయి మండలం దామెరవాయిలోని ఆదిమానవుల సమాధులను ఆదివారం పర్యాటకులు సందర్శించారు. హైదరాబాదు, హనుమకొండల నుంచి వచ్చిన యువతీ, యువకులు సూరగొండయ్యగుట్టపై ఉన్న సమాధులను వీక్షించారు. స్వీయ చిత్రాలు తీసుకున్నారు. గ్రామానికి చెందిన యువకుడు బింకారి కార్తిక్ వివిధ ఆకృతుల్లో ఉన్న సమాధులను చూపించి వాటి ప్రత్యేకతలను వివరించారు.

రామప్పలో భక్తుల సందడి



వెంకటాపూర్, న్యూస్‌టుడే: రామప్ప ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. గైడ్లు పర్యాటకులకు ఆలయ చరిత్ర, శిల్పకళా వైభవం గురించి వివరించారు. సందర్శకులు రామప్ప శిల్పాలను కెమెరాల్లో బంధించారు.


చిట్యాల ఠాణాలో ఆయుధ పూజ


కాళేశ్వరం: జమ్మి కోసం జనాల ఆరాటం..


కొత్తపల్లిగోరిలో..

ఘనంగా దసరా సంబరాలు


కాటారంలో జమ్మిచెట్టు వద్ద డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పూజలు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరంలో దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. అనుబంధ రామాలయంలో ప్రత్యేక పల్లకిలో ఉత్సవ దేవతామూర్తులను అర్చకులు రామాలయం నుంచి గోదావరి తీరం వరకు మంగళవాయిద్యాలు, భజన సంకీర్తనలతో ఊరేగింపు నిర్వహించారు. తీరం వద్ద ఏర్పాటు చేసిన జమ్మి చెట్టుకు విశేష పూజలు నిర్వహించారు. ప్రజలు ఆనందోత్సవాల నడుమ దసరా శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు బుర్రిశ్రీనివాస్, ఆలయ మాజీ ధర్మకర్తలు కామిడి రాంరెడ్డి, సమ్మయ్య, శ్యాంసుందర్‌దేవేడా పాల్గొన్నారు.

మహదేవపూర్: మహదేవపూర్ మండల కేంద్రంలో దుర్గదేవికి ప్రత్యేక పూజలు చేశారు. రంగురంగుల టపాసులు పేల్చి రావణసుర దహనం చేశారు. దసరా ఉత్సవాల సందర్భంగా నృత్య, గేయ కళాజాత ప్రదర్శన నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుబ్బగూడెం శ్రీదుర్గాదేవి ఉద్వాసన చేసి కాళేశ్వర త్రివేణి సంగమంలో నిమజ్జనం చేశారు. మందరగిరిలో శమి పూజ చేశారు.


కాటారంలో..

చిట్యాల: మండల కేంద్రంలోని చింతలపల్లి, ఏలేటి రామయ్యపల్లిలో రావణాసుర దహన కార్యక్రమం చేశారు. చిట్యాల ఠాణాలో సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావణ్‌కుమార్‌లు ఆయుధ పూజ చేశారు


కాళేశ్వరం: పల్లకీలో ఉత్సవ దేవతామూర్తుల ఊరేగింపు

మల్హర్: కొయ్యూర్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు. శమి చెట్టుకు పూజలు చేశారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి, రంగాపూర్, అకినపల్లిలో దసరా పిల్లను కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రజలు జమ్మి చెట్టు వద్ద పూజలు చేశారు. ఎస్సై అశోక్ బందోబస్తును పర్యవేక్షించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించారు.

రేగొండ, కొత్తపల్లిగోరి: మండలంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి, శ్రీహనుమాన్, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో అర్చకుల సమక్షంలో బొడ్రాయి, ఆయుధాలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో జమ్మి కోసం యువకులు పోటీ పడ్డారు. కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో సేహ యూత్ ఆధ్వర్యంలో యువకులు రావణ వధా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. నిశిధర్‌రెడ్డి, శ్రీనివాసారావు, శ్రీధర్‌గౌడ్, ప్రతాప్ రెడ్డి, భిక్షపతి, ప్రసాద్‌రావు, కవిత, తిరుపతి, శ్రీనివాస్ గౌడ్, ఆలయ ఈవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాటారం: కాటారంలో మాజీ ఉప సర్పంచి నాయిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో రావణ దహన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ, సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్‌లు ఆయుధపూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కొట్టాడని..

మండల కేంద్రంలోని ఎర్రగుంటపల్లిలో దసరా పండగ సందర్భంగా శనివారం రాత్రి డీజేతో యువకులు నృత్యం చేస్తుండగా పోలీసులు అక్కడికి చేరుకొని సమయం మించిపోయిందని నిలిపివేయాలని తెలపడంతో యువకులకు పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. డీజే బాక్సులను పోలీసులు ఠాణాకు తరలించారు. అయితే ముగ్గురు యువకులను ఓ కానిస్టేబుల్ కొట్టారని ఆరోపిస్తూ అదే రోజు రాత్రి ఎర్రగుంటపల్లి గ్రామస్థులు ఠాణా వద్దకు చేరుకున్నారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగానే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని ఎస్సై ఎం.అభినవ్ గ్రామస్థులకు తెలపడంతో వెనుదిరిగారు


మహదేవపూర్‌లో..

ఆయుధ పూజకు కాళేశ్వరం అర్చకుడు

కాళేశ్వరం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ముఖ్యమంత్రి గృహంలో ఆయుధ పూజ నిర్వహణకు కాళేశ్వరం అర్చకుడు శరత్‌చంద్రకు అవకాశం దక్కింది. జూబ్లీహిల్స్‌లోని సీఎం ఇంట్లో ఆయుధ పూజ నిర్వహణకు హైదరాబాద్‌కు చెందిన వేదపండితుడు లక్ష్మీప్రసాద్‌తో పాటు కాళేశ్వరం అర్చకుడు శరత్‌చంద్ర పాల్గొని పూజలు నిర్వహించి ముఖ్యమంత్రికి వేద ఆశీర్వచనం గావించారు. తాను ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరం దేవస్థానం అర్చకుడిని అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అర్చకుడు పరిచయం చేసుకోగా, పండిత్‌జీ అంత దూరం నుంచి వచ్చారా.. అని ముఖ్యమంత్రి అన్నట్లు శరత్‌చంద్ర తెలిపారు.


రేగొండలో బొడ్రాయి వద్ద పూజలు..


కొయ్యూర్ పోలీస్ స్టేషన్‌లో..


మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో..

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

భూపాలపల్లి: పట్టణంలోని కూరగాయల మార్కెట్ ప్రాంతం సమీపంలో రోడ్డు పక్కన చెత్త చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుంది. దీంతో దోమలు, పందుల బెడద ఎక్కువైంది. **- రాజేందర్, పాయిలెట్‌కాలనీ**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. **- మాడ కమల, వార్డు కౌన్సిలర్**

● మున్సిపాలిటీ పరిధిలోని పక్కీరుగడ్డ ప్రాంతంలో వారం రోజులుగా మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల సమస్య ఎక్కువైంది. **- రాజు, పక్కీరుగడ్డ**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులను పంపించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. **- సమ్మయ్య, వార్డు కౌన్సిలర్**

గుంత పూడ్చివేత



స్పందనకు వందనం

రేగొండ, న్యూస్‌టుడే: భాగిర్థిపేట గ్రామంలోని గొల్లపల్లి కాలనీలోని మురుగు కాల్వ కల్వర్టుపై గుంతను జీపీ సిబ్బంది పూడ్చివేశారు. నెలల గడుస్తున్న సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని కార్యదర్శి శ్రావణ్‌కు 'న్యూస్‌టుడే' వివరించగా ఆయన స్పందించి గుంతను శాశ్వతంగా పూడ్చివేశారు.

పిచ్చిమొక్కల తొలగింపు



కొత్తపల్లిగోరి (రేగొండ), న్యూస్‌టుడే: వెంకటేశ్వర్లపల్లిలోని బీసీ కాలనీలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను జీపీ సిబ్బంది తొలగించారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయిందని ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని గ్రామస్థులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. విషయాన్ని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాంప్రసాద్‌కు 'న్యూస్‌టుడే' వివరించగా ఆయన స్పందించి శుభ్రం చేశారు.

మాజీ సర్పంచి మృతి


దేవేందర్ రెడ్డి (పాతచిత్రం)

మహాముత్తారం, న్యూస్‌టుడే: మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీ తాజా మాజీ సర్పంచి బూసి దేవేందర్ రెడ్డి గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే కోలుకున్నారు. మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

మహదేవపూర్, న్యూస్‌టుడే: మహదేవపూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పర్యటించారు. మహదేవపూర్ మాజీ ఎంపీటీసీ రమేష్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.

విష జ్వరంతో వృద్ధురాలి మృతి


మల్లికాంబ (పాత చిత్రం)

ములుగు టౌన్, న్యూస్‌టుడే: విష జ్వరంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ములుగు మండలం జంగాలపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూడపాక మల్లికాంబ(70) మూడు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధ పడుతోంది. ములుగు ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించినా జ్వరం తగ్గకపోవడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

విద్యార్థుల పురోగతికి అపార్



దేవరుప్పుల (జనగామ జిల్లా), న్యూస్‌టుడే: పాఠశాల విద్యార్థులకు జాతీయ స్థాయిలో విశిష్ట 12 అంకెల గుర్తింపు నెంబరు అందించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. దీనినే అపార్(ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)గా పిలుస్తారు. ఇందుకు సంబంధించి విద్యార్థుల వివరాలు భద్రపరచడానికి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారులను కేంద్రం ఆదేశించింది.

☛ ప్రభుత్వ, ప్రభుత్వేతర విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు వీటిని కేటాయిస్తారు. నూతన విద్యా విధానంలో భాగంగా ఈ సంఖ్య కేటాయించడంతో విద్యార్థి విద్యాపరమైన ప్రగతి, మార్కులు ఎప్పటికప్పుడు జాతీయ స్థాయిలో నమోదవుతాయి. అపార్ పోర్టల్.. అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ), డిజిటల్ లాకర్‌లకు అనుసంధానమై ఉంటుంది. విద్యార్థుల పురోగతికి ఇదొక వేదికగా నిలుస్తోందని కేంద్రం అభివర్ణించింది. వివిధ విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ఉపకార వేతనాలు, మినహాయింపులు, ఇంటర్న్‌షిప్‌లకు ప్లాట్‌ఫాం మాదిరిగా పనిచేస్తుంది.

☛ ఇందులో విద్యార్థుల సమాచారాన్ని గోప్యంగా కాపాడుతారని వివిధ ప్రవేశ పరీక్షలు, సమర్పణలకు అపార్ నెంబర్ గేట్‌వేగా ఉంటుందని కేంద్రం తెలిపింది. ఆధార్ నెంబర్ తప్పనిసరి కావడంతో దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ఈ నెంబర్ ఉపయోగపడుతుందని వివరించింది. దీని ఆధారంగా విద్యార్థి సర్టిఫికెట్టు కోల్పోయినా సాఫ్ట్‌కాపీలు ఇక్కడ లభిస్తాయి.

తల్లిదండ్రులతో సమావేశాలు..

జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ వేదిక విశేషాలు గోప్యత కాపాడడం విద్యార్థికి కలిగే ప్రయోజనాలు తదితరాలు వివరించి తల్లిదండ్రుల అంగీకారం పొందడానికి పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి వారి అంగీకార పత్రాలు తీసుకుని పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని కేంద్రం ఆదేశించింది. విశేషాలను తల్లిదండ్రులకు వివరించి అవగాహన కల్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది.

ఒకే గ్రామంలో నలుగురికి ఎంబీబీఎస్ సీట్లు

ములుగు, న్యూస్‌టుడే: ములుగు జిల్లా ములుగు మండలం జగ్గన్నపేట పంచాయతీ శివారు అన్నంపల్లికి చెందిన నలుగురు గిరిజన విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. సూరజ్, సభాపతి సౌరభ్ అభయానంద్, సాయిరాం, కల్యాణిలు జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్‌లో ప్రతిభ కనబర్చి తెలంగాణలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలు పొందారు. సూరజ్‌కు భూపాలపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో, సభాపతి సౌరభ్ అభయానంద్‌కు రామగుండంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో, సాయిరాంకు సిరిసిల్లలోని ప్రభుత్వ వైద్యకళాశాలలో, కల్యాణికి కరీంనగర్‌లోని ప్రతిమ వైద్యకళాశాలలో కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయి. ఈ విద్యార్థులను ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క తన క్యాంపు కార్యాలయంలో శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. మంత్రి మాట్లాడుతూ ఒకే గ్రామం నుంచి నలుగురు విద్యార్థులు వైద్య విద్యకు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు.

జలసోయగం.. పర్యాటకుల పరవశం



వాజేడు, న్యూస్‌టుడే: దసరా సెలవుల సందర్భంగా ఆదివారం బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో జలపాతం పరిసరాలు కోలాహలంగా మారాయి. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన సందర్శకులు నీటి ధారలను తిలకిస్తూ సరదాగా గడిపారు. చరవాణుల్లో స్వీయచిత్రాలు తీసుకున్నారు.

డీఏ బకాయిలు మంజూరు చేయాలి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్ల పెండింగ్ డీఏను ప్రకటించి ఉత్తర్వులను జారీ చేయాలని భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ జిల్లా అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి కోరారు. ఆదివారం మహబూబాబాద్‌కు వచ్చిన మంత్రి దన్నసరి సీతక్కకు వినతి పత్రం అందజేశారు. జీపీఎఫ్, టీఎస్, జీఎల్ఐ, సప్లిమెంటరీ వేతనాలు చెల్లించాలన్నారు. పీఆర్‌సీని విడుదల చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. స్టడీ సర్కిల్ గౌరవ అధ్యక్షుడు సోమ గోవర్ధన్, బాధ్యులు కొమిరె ఉప్పలయ్య, భావ్‌సింగ్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య..!

అనుమానాస్పద మృతి కేసు ఛేదన

కేసముద్రం, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో మూడు రోజుల కిందట అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తిది హత్య అని.. సోదరుడు, తల్లితో కలిసి అతడి భార్య చంపివేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. ఈమేరకు నిందితులను అదుపులోకి తీసున్నామన్నారు. కేసముద్రం ఇన్‌ఛార్జి సీఐ బాబురావు, ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైఎస్సార్ కడప జిల్లా కేంద్రానికి చెందిన లక్క ప్రశాంత్, అమీనా దంపతులు ఉపాధి కోసం కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి వలస వచ్చారు. అమీనా సోదరుడు కడియాల అమీర్‌బాష, తల్లి కడియాల నూర్జాహన్ ఇదే గ్రామానికి వలస వచ్చి ప్రశాంత్ ఇంటి సమీపంలోని మరో ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఇద్దరు పిల్లలున్న అమీనాను ప్రశాంత్ రెండో వివాహం చేసుకున్నారు. కొద్ది రోజులుగా అమీనాపై అనుమానం పెంచుకున్న ప్రశాంత్ రోజూ మద్యం తాగి భార్యను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. అక్రమ సంబంధాలు అంటగడుతూ వేధిస్తున్నారు. ఎప్పటికైనా తనను చంపేస్తాడని భావించిన అమీనా ప్రశాంత్‌ను హత్య చేయాలని నిర్ణయించుకుంది. ప్రశాంత్ పెడుతున్న బాధలను అమీనా తన సోదరుడు, తల్లికి వివరించింది. ఇలాగే ఉంటే ప్రశాంత్ తనను, పిల్లలను అవసరమైతే తల్లి, సోదరుడిని కూడా చంపేస్తాడని చెప్పింది. వారు ముగ్గురు ప్రశాంత్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల పదోతేదీ రాత్రి 2.30గంటల సమయంలో గాఢనిద్రలో ఉన్న ప్రశాంత్ మెడకు తాడు బిగించి చంపేశారు. గరిటెను వేడి చేసి భర్త మర్మాంగాలపై కాల్చింది. అనుమానం రాకుండా ఆత్మహత్యగా చిత్రీకరించాలని యత్నించారు. మహబూబాబాద్ నుంచి ఆటోను రప్పించారు. ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడని నమ్మించి మృతదేహాన్ని ఆటోలో మహబూబాబాద్ తీసుకెళ్లారు. ఆటోను రైల్వే గేటు సమీపంలోకి తీసుకెళ్లాలని చెప్పడంతో అనుమానించిన ఆటో డ్రైవర్ రాము 100 నెంబరకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపించారు. పోలీసులకు సమాచారం అందించి బాధ్యతాయుతంగా వ్యవహరించిన ఆటో డ్రైవర్ రాము, వెంటనే స్పందించి నిందితులను అరెస్టు చేసిన ఎస్సై మురళీధర్‌రాజును ఎస్పీ అభినందించారు.

ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

మొగుళ్లపల్లి, న్యూస్‌టుడే: శాసనసభ మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను భారాస నాయకులు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు చదువు అన్నారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కేకు కోశారు. స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దానవేణి రాములు, నల్లభీం జగన్, అన్నారెడ్డి, దేవునూరి కుమార్, రమేష్, సాంబయ్య, రామస్వామి, మహేందర్, లింగరావు, ప్రశాంత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: భారాస ఆధ్వర్యంలో ఆదివారం చిట్యాల మండల కేంద్రంతో పాటు జడల్‌పేట, అందుకుతండా గ్రామాల్లో కేకులు కోసి స్థానికులకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు చింతల రమేశ్, జన్నె యుగంధర్, పువ్వాటి హరికృష్ణ, వీణవంక శ్రీదేవి, చందు, ఉప్పుల కిరణ్, గురకుంట్ల కిరణ్, సంఘ రాజేందర్, భూక్యా రాజు, కల్యాణ్‌సింగ్ పాల్గొన్నారు.

భూపాలపల్లి: జిల్లా కేంద్రంలోని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయంలో బడితల సమ్మయ్య ఆధ్వర్యంలో కార్మిక సంఘం నాయకులు, కార్మికులు కేక్ కోసి, మిఠాయిలు పంపిణీ చేశారు. చిరు వ్యాపారులు, రాష్ట్ర యూత్ నాయకుడు శశికాంత్ ఆధ్వర్యంలో కేక్ కోసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు సదానందం దేవరకొండ మధు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


టీబీజీకేఎస్ కార్యాలయంలో


చిట్యాలలో

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భక్తులు అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. కాళేశ్వరం గోదావరిలో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

మొగుళ్లపల్లి : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారికి ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ప్రత్యేక వాహనంలో అమ్మవారిని ప్రతిష్ఠించి ఊరేగించారు. చిన్నారులు, యువతుల నృత్యాలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు.


మొట్లపల్లిలో

కాటారం : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, లక్ష్మీదేవర ఆలయం వద్ద వేర్వేరుగా ఏర్పాటు చేసిన దుర్గామాతా అమ్మవారు ఆదివారం సర్వదేవత అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అలంకరించిన చీర వేలం పాట నిర్వహించారు. కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం కాళేశ్వరం గోదావరిలో నిమజ్జనం కోసం తరలించారు.


భూపాలపల్లిలో


కాటారంలో దుర్గామాత శోభాయాత్ర